Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్ : 9440815774

Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 93 | Tuesday 11.03.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి : 6 | సంచిక : 93 | మంగళవారం 11. 03. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4

కరెప్షన్ అనేది ఒక జబ్బులాంటిదని...దాన్ని పూర్తిగా...

## నివారించాలి



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలు, కార్యక్రమాల నిర్వహణపై ఆయా శాఖల మంత్రులు , ఉన్నతాధికారులతో సోమవారం సమీక్ష నిర్వించారు. వివిధ పథకాల అమల్లో లబ్దిదారుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా అధికారులతో సమీక్ష జరిపారు. ప్రతి వారం నాలుగు శాఖలపై సీఎం చంద్రబాబు సమీక్ష చేస్తున్నారు. ప్రభుత్వ సేవల్లో నాణ్యత పెంచడం, ప్రజలు సంతృప్తి చెందేలా కార్యక్రమాలు అమలు చేయడం ప్రధాన లక్ష్యమని సూచించారు. ఈ వారం రెవెన్యూ సర్వీసులు, ఆసుపత్రుల్లో సేవలు, దేవాలయాలు, మునిసిపల్ శాఖల్లో సేవలపై వచ్చిన రిపోర్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పదే పదే ఫిర్యాదులు వస్తున్న విభాగాల్లో బాధ్యులను గుర్తించి మార్పు వచ్చేలా చూడాలని సూచించారు. కింది స్థాయి ఉద్యోగులు, అధికారులకు ఉన్నతాధికారులు కౌన్సలింగ్ నిర్వహించడం ద్వారా సేవలు మెరుగుపరచాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతి విషయంలో ఏమాత్రం సహించవద్దని అధికారులను అదేశించారు. కరెప్షన్ అనేది ఒక జబ్బులాంటిదని...దాన్ని పూర్తిగా నివారించాల్సిందేనని సీఎం వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో జరిగిన రివ్యూ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, మంత్రి అనగాని సత్యప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**బలహీనవర్గాలకు పెద్దపీట.. :**

కాగా బలహీనవర్గాలకు పెద్దపీట.. ప్రాంతాల నడుమ సమతూకం.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారులో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు పాటించిన ప్రధాన కొలమానాలు ఇవే.. ఉత్తరాంధ్ర, కోస్తా,

మిగతా 2 లో

భక్తుల సౌకర్యాలలో...

## జగన్ ప్రభుత్వం విఫలం

: హోం మంత్రి అనిత ధ్వజం



అనకాపల్లి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** గత జగన్ ప్రభుత్వంలో భక్తులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని హోం మంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. భక్తుల భద్రతకు వైసీపీ ప్రభుత్వంలో కనీస చర్యలు తీసుకోలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ(సోమవారం) ఉపమాక శ్రీ కల్కి వేంకటేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణోత్సవం జరిగింది. శ్రీవారి వార్షిక కల్యాణోత్సవం సందర్భంగా ఉపమాక వెంకన్నకు హోం మంత్రి అనిత పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో మంత్రికి

మిగతా 2 లో

రాయలసీమ అభివృద్ధిపై...

## ప్రత్యేక కార్యాచరణ



పశ్చిమగోదావరి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** పోలవరం ఎడమ కాల్వ పనులు ఈ ఏడాది జూన్ నెల నాటికి పూర్తి చేసి ఉత్తరాంధ్రకు సాగునీరు అందించే లక్ష్యంతో పనిచేస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. 2026 జూన్ నాటికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లాలో మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మట్లాడారు. ఏడు వందల కిలోమీటర్ల ప్రవహించి రాయలసీమను సస్యశ్యామలం చేసే హంద్రీనీవా ప్రాజెక్టు పనులను వేగంగా చేపట్టామని

మిగతా 2 లో

పిఠాపురం...

## పవన్ కల్యాణ్ అడ్డా..

వర్మ వ్యవహారం టీడీపీ అంతర్గత అంశం: నాదెండ్ల మనోహర్
ఎమ్మెల్సీ టికెట్ల కేటాయింపులో వర్మకు నిరాశ
వర్మ చాలా సీనియర్ రాజకీయవేత్త అన్న నాదెండ్ల
గత ఎన్నికల్లో పవన్ కు ఎంతో సహకరించారని వెల్లడి
ఆయనంటే తమకు గౌరవం ఉందని స్పష్టీకరణ
వర్మకు చెక్ పెట్టేందుకు దొరబాబును పార్టీలోకి తీసుకున్నారన్న వాదన నిజం కాదని వివరణ

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** పిఠాపురం టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు ఎమ్మెల్సీ టికెట్ దక్కకపోవడం చర్చనీయాం శంగా మారిన నేపథ్యంలో, జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు. వ

మిగతా 2 లో



అంగన్వాడీలకు సంబంధించిన 4 సమస్యలు...

## పరిష్కరించాం

మా పనితీరుకు అదే నిదర్శనం.. మంత్రి నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు
మంగళగిరిలో ఉచిత ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఉపాధ్యాయుల సమస్యలను ఓ క్రమపద్ధతిలో పరిష్కరించామని విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. అంగన్వాడీలకు సంబంధించిన 4 సమస్యలు పరిష్కరించామని అన్నారు. ఈ నెల 19వ తేదీన మల్లవల్లిలో జరిగే అశోక్ లైల్యాండ్ ప్రారంభోత్సవంలో తాను పాల్గొంటున్నానని తెలిపారు. ఏపీకి పెట్టుబడులు ఓ క్రమపద్ధతిలో ఒక్కొక్కటిగా తెస్తున్నామని మంత్రి నారా లోకేష్ చెప్పారు. గత జగన్ ప్రభుత్వంలో రాష్ట్రంలో పెట్టుబడి పెట్టినవాళ్లకు


మిగతా 2 లో




యువతకు టీడీపీ సముచిత అవకాశాలు...

## కల్పిస్తోంది : దేవినేని

టీడీపీ ఆ విషయం మరోసారి రుజువు చేసింది : దేవినేని ఉమా..



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కావలి గ్రీష్మ, బీద రవిచంద్ర, బీటీ నాయుడుని ఎంపిక చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్లు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఆయన అభినందనలు తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజ్యాధికారం కల్పించేలా తెలుగు దేశం పార్టీలో ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన విధానాన్ని చంద్రబాబు కొనసాగిస్తున్నారని కొనియాడారు. ముగ్గురు అభ్యర్థులూ

మిగతా 2 లో

ఏపీ కూటమి పాలనపై యువతలో...

## తీవ్ర అసంతృప్తి : సజ్జల

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఏపీలో కూట మి పాలనపై యువత తీవ్ర అసంతృప్తి లో ఉందని వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. తాడేపల్లి పార్టీ కార్యాలయం నుంచి వైసీపీ రీజనల్ కోఆర్డి నేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు, యువకులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొ

మిగతా 2 లో



# సంపాదకీయం

## చివరి దశకు కశ్మీర్ వ్యవహారం

కశ్మీర్ వ్యవహారం ఫైనల్ స్టేజ్‌కు చేరుకోబోతుందా..? పరిస్థితులు చూస్తుంటే.. అలాగే కనిపిస్తోంది. త్వరలోనే పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో సహా కశ్మీర్ అంశంలో పాకిస్తాన్‌కు భారత్ బుద్ధి చెప్పే తరుణం ఆసన్నమయ్యింది. పాక్ ఆక్యూపైడ్ కశ్మీర్ కేంద్రంగా భారత్‌ను ఇబ్బందిపెట్టడానికి అంతర్జాతీయ వేదికలను పాకిస్తాన్ ఎక్కువగా ఉపయోగిస్తోంది. కశ్మీర్ అంశాన్ని శాంతి చర్చలతో పరిష్కరించాలని పాక్ ప్రధాని ఇటీవల భారత్‌కు పిలుపునిచ్చారు. ఈ తరుణంలో.. అసలు భారత్ ఏమనుకుంటుందో అనే సందేహం పాక్ మెదణ్ని తొలిచేస్తున్నట్లుంది. తాజాగా, భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ లండన్‌లో ఓ కార్యక్రమానికి అటెండ్ అవ్వగా.. అక్కడ ఒక పాకిస్తాన్ జర్నలిస్టు.. మంత్రి జైశంకర్‌ని ఉద్దేశించి ప్రశ్న అడిగారు. అయితే, ఈ ప్రశ్నలో పాక్ జర్నలిస్ట్ విచిత్రమైన వాదన చేశారు. కశ్మీర్‌ను భారత్ చట్టవిరుద్ధంగా ఆక్రమిస్తుందని అన్నారు. అందుకే, కశ్మీరీలు భారత్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నారని ఆరోపించారు. ఇక, "కశ్మీర్‌పై శాంతి ఒప్పందం కోసం అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ సహాయం తీసుకుంటారా..? ప్రధాని మోడీ.. ట్రంప్‌కు మంచి స్నేహితుడే కాబట్టి, ఆ దిశగా ఏదైనా ప్రయత్నాలు జరగొచ్చా..?" అంటూ పాకిస్తాన్ టోన్‌లో సదరు జర్నలిస్ట్ ఆసక్తికర ప్రశ్నను లేవనెత్తారు. అయితే, జర్నలిస్ట్ ఉద్దేశం అర్థమైన మంత్రి జైశంకర్ అంతే స్పష్టంగా ఆన్సర్ ఇచ్చారు. లండన్‌కు చెందిన థింక్ ట్యాంక్ 'చాథమ్ హౌస్'లో జరిగిన ఈ కార్యక్రమంలో.. కశ్మీర్ సమస్యకు పరిష్కారం ఏంటనే అంశంలో మంత్రి జైశంకర్ 'టిట్ ఫర్ ట్యాట్'లా సమాధానం ఇచ్చారు. భారత ప్రభుత్వం ఇప్పటి వరకూ కాశ్మీర్ విషయంలో చాలా మంచి పనులే చేసిందని అన్నారు. అలాగే, కశ్మీర్‌లో ఇప్పటికే చాలా సమస్యలు పరిష్కరించామని తెలిపారు. అందులో మొదటి అడుగు ఆర్టికల్ 370ని తొలగించడమనీ.. కాశ్మీర్‌లో వృద్ధి, ఆర్థిక కార్యకలాపాలు, సామాజిక న్యాయాన్ని పునరుద్ధరించడం రెండవ అడుగనీ.. భారీగా పెరిగిన ఓటింగ్‌తో ఇటీవల ఎన్నికలు నిర్వహించడం మూడవ అడుగని అన్నారు. ఇక, చట్టవిరుద్ధంగా పాకిస్తాన్ ఆక్రమించిన 'కాశ్మీర్‌లోని దొంగిలించిన భాగాన్ని' భారతదేశానికి తిరిగి ఇచ్చిన తర్వాత కాశ్మీర్ సమస్య "పరిష్కరించబడినట్లే" అని జైశంకర్ స్పష్టం చేశారు. జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన భారత భూభాగాన్ని పాకిస్తాన్ అక్రమంగా ఆక్రమించుకోవడం మాత్రమే కశ్మీర్ అంశంలో పరిష్కరించాల్సిన ఏకైక సమస్య అని భారత్ పలు సందర్భాల్లో చెప్పింది. జమ్మూ కాశ్మీర్‌లోని దాదాపు 78 వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని పాకిస్తాన్ అక్రమంగా ఆక్రమించుకుందన్న మాటను పదే పదే చెబుతోంది. 1994 పార్లమెంటు తీర్మానం కూడా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇందులో భారత్ వైఖరి స్పష్టంగా తెలియజేశారు. "జమ్మూ కశ్మీర్, లడఖ్‌కు సంబంధించినంత వరకూ మొత్తం భూభాగం భారతదేశంలో అంతర్భాగంగా ఉండేవి, ఉన్నాయి, ఉంటాయి అని" పేర్కొన్నారు. అలాగే, "పాకిస్తాన్ చట్టవిరుద్ధంగా, బలవంతంగా ఆక్రమించుకున్న అన్ని ప్రాంతాలను వెంటనే ఖాళీ చేయాలని" ఈ తీర్మానం పిలుపునిచ్చింది. మంత్రి జైశంకర్ లండన్‌లో తాజాగా చేసిన వ్యాఖ్యలకు పాకిస్తాన్ నుండి తీవ్రమైన స్పందన వచ్చింది. పాకిస్తాన్ విదేశాంగ కార్యాలయ ప్రతినిధి షఫ్కత్ అలీ ఖాన్ మాట్లాడుతూ.. "మార్చి 5న భారత విదేశాంగ మంత్రి జమ్మూ కాశ్మీర్‌పై చేసిన వ్యాఖ్యలను పాకిస్తాన్ తిరస్కరిస్తుందని అన్నారు. భారతదేశం గత 77 సంవత్సరాలుగా జమ్మూ కాశ్మీర్‌ను ఆక్రమిస్తుందనీ.. భారత్ ఆక్రమించిన ఆ ప్రాంతంలోని పెద్ద భూభాగాలను ఖాళీ చేయాలని" డిమాండ్ చేశారు. కట్ చేస్తే ఫ్లాష్ బ్యాక్‌లో ఇటీవల.. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ దీనికి విరుద్ధంగా శాంతి మంత్రం వల్లించారు. కశ్మీర్ అంశం సహా భారత్‌తో ఉన్న అన్ని సమస్యలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని కోరుకుంటున్నట్లు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వెల్లడించారు. ఐక్యరాజ్యసమితిలో చేసిన వాగ్దానాలను భారత్ నెరవేర్చి, చర్చలకు ముందుకు రావాలంటూ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి ప్రారంభంలో.. "కాశ్మీర్ సంఘీభావ దినోత్సవం" సందర్భంగా పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ శాసనసభ ప్రత్యేక సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ యావత్తూ భారత భూభాగమని మంత్రి జైశంకర్ చెప్పడం కొత్తేమీ కాదు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ భారతదేశంలో భాగమని? ప్రతి భారతీయ రాజకీయ పార్టీ ఖూఐ భారతదేశానికి తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ఆ మధ్య, న్యూఢిల్లీలోని ఢిల్లీ విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో జరిగిన సంభాషణలో కూడా జైశంకర్ దీన్ని స్పష్టం చేశారు.. పాకిస్తాన్ ఆక్రమణలో ఉన్న జమ్మూ కశ్మీర్ భాగాన్ని తిరిగి తీసుకుంటామంటే.. దాన్ని ఎవరు ఆపుతున్నారు? దాన్ని తిరిగి తీసుకోవద్దని కశ్మీర్ ప్రజలు ఎప్పుడైనా చెప్పారా?" అని ముఖ్యమంత్రి రాష్ట్ర అసెంబ్లీలో వెల్లడించారు. కార్గిల్ యుద్ధంలో కూడా భారతదేశానికి పీఓకెను తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం వచ్చిందనీ.. కానీ, అలా చేయడంలో భారత్ ఎందుకు విఫలమైందని అబ్దుల్లా అడిగారు. ఇక, కేంద్రం పీఓకేను తిరిగి స్వాధీనం చేసుకునే క్రమంలోనే.. ప్రస్తుతం చైనా నియంత్రణలో ఉన్న జమ్మూ-కశ్మీర్ భాగాన్ని కూడా తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఒమర్ అబ్దుల్లా కోరారు. ఇటీవల చైనాతో భారతదేశ సంబంధం కాస్త మెరుగుపడుతుందని మంత్రి జైశంకర్ వెల్లడించారు. చైనా గురించి, మాట్లాడుతూ? టిబెట్‌లో కైలాస పర్వత తీర్థయాత్ర మార్గం ప్రారంభంతో సహా అక్టోబర్ 2024 నుండి జరిగిన కొన్ని పరిణామాలు చైనా-భారత్ సంబంధాలను మెరుగుపరుస్తున్నాయని అన్నారు. "ప్రపంచంలో రెండు బిలియన్లకు పైగా జనాభా కలిగిన ఏకైక దేశాలుగా చైనాతో మాకు చాలా, చాలా ప్రత్యేకమైన సంబంధం ఉందనీ.. రెండు దేశాల ఆసక్తులను గౌరవించే, సున్నితత్వాలను గుర్తించే, ఇద్దరికీ ఉపయోగకరంగా ఉండే సంబంధాన్ని భారత్ కోరుకుంటుంది" అని అన్నారు. గత దశాబ్ద కాలంలో భారత్‌కు సరిహద్దు దేశాల వ్యవహారంలో ప్రతికూల పరిస్థితులే ఎదురయ్యాయి. మాల్దీవుల నుండి నేపాల్ వరకూ ఒక రకమైన సమస్య ఉంటే? శ్రీలంక, బంగ్లాదేశ్‌ల నుండీ మరో రకమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక, పాకిస్తాన్, చైనాలు సందు దొరికితే భారత్ భూభాగాన్ని ఆక్రమించుకోడానికి సరంజామాలు రెడీ చేసుకుంటూనే ఉన్నాయి. ఆర్థికంగా భారత్ పరుగులు పెడుతుంటే? రక్షణ రంగంలో అభివృద్ధి సాధిస్తుంటే? ఇంకోవైపు నుండీ? చైనా సహాయంతో పాకిస్తాన్ రెచ్చిపోతూనే ఉంది. చైనా నుండి భారీగా ఆయుధాలు కొనుగోలు చేస్తూ భారత్‌నే ఛాలెంజ్ చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ మాటలు చెప్పడాన్ని దాటి ఏదైనా చేయాలనే కామెంట్లు ఎప్పటి నుండో వినిపిస్తున్నాయి. మరి, భారత్ దీనికి పరిష్కారం ఎలా సాధిస్తుందో చూడాలి.

# కరెప్షన్ అనేది ఒక జబ్బులాంటిదని...

రాయలసీమ ప్రాంతాల నడుమ సమతూకం పాటిస్తూ చంద్రబాబు ఎమ్మెల్సీ అభ్యర్థులను ఖరారు చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచీ బీసీలకు పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలో తాజాగా ప్రకటించిన మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో రెండింటిని బీసీలకు కేటాయించింది. ఒక స్థానాన్ని ఎస్సీ మహిళకు ఇచ్చింది. వీరిలో బీటీ నాయుడు, బీద రవిచంద్ర యాదవ్, కావలి గ్రీష్మ ఉన్నారు.

**కలిసొచ్చిన కలుపుగోలు :**

కావలి నియోజకవర్గానికి చెందిన బీద రవిచంద్రయాదవ్ టీడీపీకి తొలినుంచీ విధేయుడిగా ఉంటున్నారు. బీసీ సామాజికవర్గానికి చెందిన రవిచంద్ర ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా చేశారు. జిల్లాలో నాయకుల మధ్య ఎన్ని విభేదాలున్నా రవిచంద్ర విషయంలో అందరి నడుమ ఏకాభిప్రాయం ఉంటుంది. అందరినీ కలుపుకొని వెళ్లడం.. పార్టీకి ట్రబుల్ షూటర్‌గా పనిచేయడం బీద రవిచంద్రను ఎమ్మెల్సీ రేసులో విజయం సాధించేలా చేశాయి. 2015లో ఒకసారి ఎమ్మెల్సీగా పనిచేసిన రవిచంద్రకు మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు.

**బలమైన గళం వినిపించేందుకు :** పార్టీలో యువరక్తాన్ని తీసుకురావాలన్న ఆలోచనతోపాటు ఎస్సీ మహిళకు ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో శ్రీకాకుళానికి చెందిన కావలి గ్రీష్మకు ఎమ్మెల్సీ అవకాశం దక్కింది. మండలిలో వైసీపీకి ఆధిక్యం ఉండటం.. వారి తరపున గట్టిగా మాట్లాడే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో ధీటుగా ఎదుర్కోవాలంటే టీడీపీ నుంచి బలమైన గళాన్ని వినిపించే వారు ఉండాలన్న ఉద్దేశంతో ఫైర్ బ్రాండ్‌గా పేరుపొందిన కావలి గ్రీష్మకు అవకాశం కల్పించారు. గ్రీష్మ గత ఎన్నికల్లో రాజాం నియోజకవర్గం టికెట్ ఆశించారు. గ్రీష్మ తల్లి ప్రతిభా భారతి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులపై గ్రీష్మ విరుచుకుపడిన తీరు.. ఒంగోలులో నిర్వహించిన మహానాడులో వైసీపీ నాయకులను సవాల్ చేస్తూ తొడకొట్టిన తీరు ఆమెను పార్టీలో ఫైర్ బ్రాండ్‌గా నిలిపాయి. 2017లో క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించిన గ్రీష్మ రాజాం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జిగా చేశారు. పార్టీ అధికార ప్రతినిధిగా ఉన్నారు. కూటమి అధికారంలోకి రాగానే గ్రీష్మను ఏపీ మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్‌గా నియమించారు. తాజాగా ఆమెకు ఎమ్మెల్సీ అవకాశాన్ని ఇచ్చారు.

# అంగన్వాడీలకు ...

ఇవ్వాల్సిన రాయితీల్లో 50శాతం వాటా అడిగారని కొందరు పారిశ్రామికవేత్తలు తమ దృష్టికి తెస్తున్నారని మంత్రి నారా లోకేష్ అన్నారు. ఏపీలో ఇక అలాంటి పరిస్థితులు ఉండబోవని వారికి హామీ ఇచ్చి ఒప్పిస్తున్నామని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను జగన్ ప్రభుత్వం రూ.4500కోట్లు పెట్టి దిగిపోయిందని ఆరోపించారు. చిక్కీ, గుడ్డు, స్కూల్ కిట్స్‌లో రివర్స్ టెండరింగ్ లేకుండా రూ.1000 కోట్లను తమ ప్రభుత్వం ఆదా చేసిందని తెలిపారు. పాఠశాల విద్యార్థుల యూనిఫామ్‌లోనూ నాణ్యత పెంచామని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఏపీ జెల్లడ పట్టి నియమిస్తున్న వీసీలే తమకూ కావాలని కేంద్ర ప్రభుత్వం వారిని కోరి తీసుకుపోతోందని మంత్రి నారా లోకేష్ చెప్పారు. మొదటిసారి గెలుపొందిన ఎమ్మెల్యేలకు రాజకీయ శిక్షణ తరగతి కూడా చాలా అవసరమని భావిస్తున్నామని తెలిపారు. కొందరికి ప్రజలకు ఏం చేయాలి, కేడర్‌తో ఎలా ఉండాలో తెలియట్లేదు కాబట్టి పార్టీపరంగా ఓ సెషన్ ఏర్పాటు చేయాలని కోరారు. మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేల్లో ప్రభుత్వ పెద్దలు చెబితే వినేవారే ఎక్కువగా ఉన్నారని మంత్రి నారా లోకేష్ తెలిపారు.


**ఎవరూ ఆందోళన చెందొద్దు.. :**

బలహీనవర్గాలకు ఎమ్మెల్సీలుగా ప్రాధాన్యం కల్పించి తెలుగుదేశం పార్టీ వారి పట్ల ఉన్న చిత్తశుద్ధిని మరోమారు చాటుకుందని మంత్రి నారా లోకేష్ తెలిపారు. మీడియాతో మంత్రి నారా లోకేష్ చిట్ చాట్ చేశారు. శాసనమండలిలో గొంతు ఉన్న యువ మహిళలను ప్రోత్సహించేందుకు గ్రీష్మకు అవకాశం కల్పించామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్టీ పట్ల బీదా రవిచంద్ర, బీటీ నాయుడులు చూపిన విధేయత అందరికీ తెలిసిందేనని అన్నారు. దశల వారీగా కష్టపడిన అందరికీ పదవులు వస్తాయని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని అన్నారు. బీద రవిచంద్రకు మంత్రి లోకేష్ అభినందనలు తెలిపారు. లోకేష్‌ను మర్యాద పూర్వకంగా బీద రవిచంద్ర కలిశారు. ప్రజాసమస్యలను శాసన మండలి దృష్టికి తెచ్చి పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి నారా లోకేష్ కోరారు.

**మంగళగిరిలో ఉచిత ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్ :**

మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ఉచిత ఎలక్ట్రిక్ బస్సు సేవలను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ నేడు ఉండవల్లి నివాసంలో జెండా ఊపి ప్రారంభించారు. సుదూర ప్రాంతాల నుంచి ఎయిమ్స్ హాస్పిటల్, పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్న విషయం మంత్రి లోకేశ్ దృష్టికి వచ్చింది. సీఎస్ఆర్ నిధుల నుంచి బస్సులను సమకూర్చాల్సిందిగా మేఘా ఇంజనీరింగ్ & ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ను మంత్రి లోకేశ్ అభ్యర్థించారు. లోకేశ్ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన MEIL ఫౌండేషన్ రూ.2.4 కోట్ల విలువైన రెండు అత్యాధునిక Olectra 7 మీటర్ల ఎలక్ట్రిక్ బస్సులను అందజేసింది. ఈ బస్సుల్లో ఒకటి మంగళగిరి బస్టాండు నుంచి ఎన్ఆర్ఐ జంక్షన్, డీజీపీ ఆఫీసు మీదుగా ఎయిమ్స్ కు నడుస్తుంది. మరొకటి మంగళగిరి బస్టాండు నుంచి ఎన్ఆర్ఐ జంక్షన్ మీదుగా పానకాలస్వామి గుడివరకు నడుస్తుంది. ఎయిమ్స్ కు వెళ్లే బస్సు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు... పానకాలస్వామి ఆలయానికి వెళ్లే బస్సు ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రయాణీకులకు ఉచితంగా సేవలందిస్తుంది. ప్రతి బస్సు 18 మంది ప్రయాణికుల సామర్థ్యంతో సింగిల్ ఛార్జింగ్ తో 150 కి.మీ. వరకు నడుస్తుంది. ఈ బస్సులు డిజిటల్ ఇన్ స్ట్రుమెంట్ ప్యానెళ్లు, ఎలక్ట్రానిక్ హైడ్రాలిక్ పవర్ స్టీరింగ్ , రియల్-టైమ్ వెహికల్ ట్రాకింగ్ సిస్టమ్స్, రివర్స్ పార్క్ అసిస్ట్ సిస్టమ్స్ వంటి అత్యాధునిక సౌకర్యాలతో భద్రతా ప్రమాణాలు కలిగి ఉంటాయి. ఈ కార్యక్రమంలో ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ K.V. ప్రదీప్, ఎయిమ్స్ డైరక్టర్ శాంతా సింగ్, డిప్యూటీ డైరక్టర్ శశికాంత్, లక్ష్మీనరసింహస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ. కోటిరెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీదేవి, పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ సంగీత గాయకులు గరిమెళ్ల బాల కృష్ణ ప్రసాద్ మృతి



హైదరాబాద్, తెలుగు యూనివర్సిటీ : సంగీత స్వరకర్త, శాస్త్రీయ సంగీత గాయకులు, టీటీడీ ఆస్థాన విద్వాంసుడు కళారత్న గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (76) కన్నుమూశారు. తిరుపతిలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ 1976లో టీటీడీ అన్నమయ్య ప్రాజెక్ట్‌లో గాయకుడిగా చేరి 2006లో ఉద్యోగ విరమణ పొందారు. అన్నమయ్య కీర్తనలు ఆలపించడంలో స్వరపరచడంలో రికార్డు చేయడంలో పుస్తక ప్రచురణలో జీవితాన్ని అంకితం చేశారు. ఆయన సేవలకు గానను కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని కూడా అందుకున్నారు. శాస్త్రీయ సంగీత విద్వాంసుల్లో మంచి మానవీయ హృదయం వున్న మహా గాయక విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్. విద్వత్తు ఉన్నా శిఖరమంత ప్రతిభ పుక్కిట పట్టినా ఎంతో వినమ్రత గల వ్యక్తి. జగడపు చనువుల జాతర కీర్తన ఆయనకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చింది అని చెప్పవచ్చు. మహామహులు ఎందరో శాస్త్రీయ కచేరీలు చేసినా తెలుగునాట సంకీర్తనా యజ్ఞ ప్రక్రియను తొలిసారిగా ప్రవేశపెట్టిన ఘనత గరిమెళ్లకే దక్కుతుంది. భక్తి టీవీ హరి సంకీర్తన ద్వారా ఎందరో శిష్యులను తీర్చిదిద్దారు. వేలాది వేదికలపై కచేరీలు చేశారు. 300 కీర్తనలు నాన్‌స్టాప్‌గా పాడిన ఘనత గరిమెళ్లది. 600 పైగా అన్నమయ్య కీర్తనలను స్వరపరచి వెలుగులోకి తెచ్చారు. ఆరు వేలకు పైగా కచేరీలు చేశారు. సిలికానాంధ్ర సంస్థ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన లక్ష గళార్చనలో బాలకృష్ణ ప్రసాద్ ప్రధాన గాయకులు! ఆ కార్యక్రమం గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు లో చోటు చేసుకుంది. బాలకృష్ణ ప్రసాద్ మంచి భక్తి గీత రచయిత. శ్రీవేంకటేశ్వర స్వామి చెంత సేవకులుగా ఉన్నప్పటికీ ఆయన స్వయాన హనుమాన్ భక్తులు. 21 ఆంజనేయ కృతులు రచించి స్వరపరచారు. వినాయకుడిపై 50 కృతులు రచించారు. వెయ్యికి పైగా కీర్తనలు రచించి స్వరపరచి జన బాహుళ్యం లోకి తీసుకెళ్లడంలో విశేష కృషి చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసులుగా, కంచి కామకోటి పీఠం, అహోబిల మఠం ఆస్థాన సంగీత విద్వాంసులుగా సేవలు అందించారు. ఆయన స్వరపరచిన సంకీర్తనలను అనేక పుస్తకాలుగా టీటీడీ ప్రచురించింది. భార్య రాధ, కుమారులు పవన్ కుమార్, అనిల్ కుమార్ శ్రీవేంకటేశ్వర స్వామికి అంకితమై సేవలు అందిస్తున్నారు. రాజమండ్రి వాస్తవ్యులైన గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ ప్రముఖ సంగీత విద్వాంసులు నేదునూరి కృష్ణమూర్తి శిష్యులు. తిరుపతిలో స్థిరపడి అన్నమయ్య అంశగా గుర్తింపు పొందారు. ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్. జానకి మేనల్లుడు బాలకృష్ణ ప్రసాద్. సినిమా అవకాశాలు వచ్చినా శాస్త్రీయ సంగీతానికి, స్వామి వారి సేవకు అంకితమై జీవించారు. ఆయన కీర్తనలు భూమి ఉన్నంత కాలం తెలుగు గడ్డపై వినిపిస్తూనే ఉంటాయి.

# మహాకుంభ్‌లో గంగాజలం.. స్నానానికి యోగ్యమైందే : పార్లమెంట్‌లో కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ: ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద మహాకుంభ వేళ గంగా నది నీరు స్నానానికి యోగ్యంగా ఉన్నట్లు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇచ్చిన నివేదికను కేంద్ర ప్రభుత్వం ఇవాళ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. 2023 నుంచి 2025 వరకు గంగా నది నీటి శుభ్రత కోసం రూ.7421 కోట్లు కేటాయించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఆనంద్ భదౌరియా, కాంగ్రెస్ ఎంపీ కే సుధాకర్ వేసిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపిందర్ యాదవ్ సమాధానం ఇచ్చారు. సీపీసీబీ రిపోర్టు ప్రకారం.. పీహెచ్ వాల్యూ, డిజాల్వ్ ఆక్సిజన్, బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్, ఫీకల్ కోలిఫామ్ పరిమితులకు తగినట్లుగానే ఉన్నట్లు తెలిపారు. అన్ని విలువల అమృత స్నానం చేసేందుకు అనుకూలంగా ఉన్నట్లు చెప్పారు. డీవో, బీఓడీ, ఎఫ్‌సీ ద్వారా నీటి నాణ్యత తెలుస్తుందన్నారు. కేంద్ర కాలుష్య నివారణ బోర్డు ఫిబ్రవరి 3వ తేదీన ఇచ్చిన నివేదికలో ప్రయాగ్‌రాజ్‌లోని నీటి నాణ్యతపై సందేహాలు వ్యక్తం చేసింది. నీటిలో మల శాతం ఎక్కువగా ఉందని, దీని వల్ల మహాకుంభ్ నీరు స్నానానికి అనువైనట్లుగా లేదని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌కు సీపీసీబీ చెప్పింది. అయితే ప్రయాగ్‌రాజ్ నీటి నాణ్యతపై మళ్లీ ఫిబ్రవరి 28వ తేదీన కొత్త రిపోర్టును సమర్పించారు. ఆ రిపోర్టు ప్రకారం త్రివేణి సంగమ నీరు స్నానానికి అనువుగా ఉన్నట్లు సీపీసీబీ పేర్కొన్నది. వేర్వేరు తేదీల్లో, వేర్వేరు ప్రాంతాల నుంచి సేకరించిన శ్యాంపిళ్ల ఆధారంగా డేటాను విశ్లేషించినట్లు తెలిపారు. ప్రయాగ్‌రాజ్‌లోని శృంగవర్‌పుర్ ఘాట్ నుంచి దీనాఘాట్ వరకు వారానికి రెండు సార్లు శ్యాంపిళ్లను సేకరించారు. త్రివేణి సంగమ ప్రాంతం నుంచి కూడా నీటిని టెస్టింగ్ కోసం సేకరించారు. జనవరి 12వ తేదీ నుంచి మ్యానిటరింగ్ ప్రారంభమైంది. అమృత స్నానాలు జరిగిన రోజుల్లో నీటిని పరీక్షించారు. ప్రయాగ్‌రాజ్‌లో ఏర్పాటు చేసిన 10 సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల డేటాను కూడా మానిటర్ చేశారు. మహాకుంభ్‌లో వేస్ట్‌వాటర్‌ను ట్రీట్ చేసేందుకు ఉత్తరప్రదేశ్ సర్కారు పది సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. ఇక 21 డ్రైనేజీల ప్రదేశాల వద్ద వాటర్ ట్రీట్మెంట్ చేసింది. దీని కోసం ఏడు జియో ట్యూబ్‌లను అమర్చింది. నీటి శుభ్రత కోసం అడ్వాన్స్ స్థాయి ఆక్సిడేషన్ టెక్నిక్‌లను వాడినట్లు అధికారులు చెప్పారు.



## యువతకు టీడీపీ సముచిత అవకాశాలు...

పెద్దల సభలో ప్రజా సమస్యలను ఎత్తి చూపుతూ విపక్షాల దాడిని సమర్థంగా తిప్పికొడతారని ఆశిస్తున్నట్లు మాజీ మంత్రి చెప్పుకొచ్చారు. టీడీపీకి వెన్నెముక లాంటి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సముచిత స్థానం కల్పించడంలో చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారనే విషయం మరోసారి రుజువైందని అన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి దేవినేని ఉమా మాట్లాడుతూ.."ముఖ్యమంత్రి చంద్రబాబు సాహసోపేతమైన నిర్ణయాలతో అభివృద్ధిలో అందరినీ భాగస్వామ్యం చేస్తున్నారు. అన్ని వర్గాలనూ ప్రోత్సహిస్తూ విద్యావంతులు, యువతకు టీడీపీ సముచిత అవకాశాలు కల్పిస్తోంది. పార్టీ ఆవిర్భావం నుంచీ యువత, విద్యావంతులు, వివిధ వృత్తులలో ఉన్నవారికి, మహిళలు, గ్రాడ్యుయేట్లకు పెద్దపీట వేసిన ఎన్టీఆర్ విధానాన్ని చంద్రబాబు కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఎస్సీ, బీసీ, మహిళ, విద్యావంతుల సమ్మేళనంగా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా. ఎమ్మెల్సీలుగా ఎన్నికైన తర్వాత కావలి గ్రీష్మ, బీద రవిచంద్ర యాదవ్, బీటీ నాయుడు.. శాసనమండలిలో పార్టీ, ప్రజల వాణిని వినిపించాలని ఆకాంక్షిస్తున్నా. వీరంతా ప్రతిపక్ష నేతల కుటిల విమర్శలను తిప్పికొట్టడంలో సమర్థవంతంగా పనిచేయాలి. వైసీపీ దుర్మార్గపు నిర్ణయాలను అవినీతిని ఎండగట్టడంలో ముందుండాలని కోరుకుంటున్నా. కాంగ్రెస్ దాష్టికాలను ఎదిరించిన ప్రతిభా భారతి కుమార్తె, జస్టిస్ పుల్లయ్య మనుమరాలు గ్రీష్మ పెద్దల సభలో సమర్థవంతంగా తన వాణి వినిపించాలి. పార్టీ పదవి ద్వారానే నెల్లూరు జిల్లాలో అందరినీ సమన్వయం చేసి రైతాంగ సమస్యలపై పనిచేసిన బీద రవిచంద్ర యాదవ్.. పార్టీ ఇచ్చిన అవకాశంతో మరింత సమర్థవంతంగా పనిచేయాలని కోరుకుంటున్నా. చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు న్యాయవాదులతో మాట్లాడడమే కాకుండా ఆయనకు, పార్టీ కార్యకర్తలకు అనుసంధానకర్తగా వ్యవహరించి ఎమ్మెల్సీగా అవకాశం దక్కించుకున్న బీటీ నాయుడు సైతం ప్రజా సమస్యలపై పోరాడాలని" చెప్పారు.

## పిఠాపురం...

చాలా సీనియర్ రాజకీయవేత్త అని వెల్లడించారు. ఆయన కూడా సుదీర్ఘమైన రాజకీయ ప్రయాణం చేశారని, గతంలో ఎన్నో ఇబ్బందులు పడిన విషయం మనందరం చూశామని వివరించారు. అయితే, పదవులు ఎవరికి కేటాయిస్తారనేది ఆయా పార్టీల అధిష్ఠానాలు నిర్ణయం తీసుకుంటాయని నాదెండ్ల స్పష్టం చేశారు. వర్మ విషయం కూడా టీడీపీ అంతర్గత వ్యవహారమని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఆయన పవన్ కల్యాణ్ కు ఎంతో సహకరించారని... ఆయనపై తమకు గౌరవం ఉందని, ఆయనకు సముచిత గౌరవం దక్కాలని కోరుకుంటున్నామని తెలిపారు. పవన్ కల్యాణ్ కూడా... అవకాశం ఉంటే తాను పదవి తీసుకోకుండా ఇతరులకు పదవిని ఇచ్చే వ్యక్తి అని నాదెండ్ల కొనియాడారు. ఇక పెండెం దొరబాబు ఇటీవల జనసేనలో చేరడంపై ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు నాదెండ్ల ఆసక్తికర సమాధానం ఇచ్చారు. వర్మకు చెక్ పెట్టడానికే దొరబాబును పార్టీలోకి ఆహ్వానించారా? అని ఆ రిపోర్టరర్ ప్రశ్నించగా... అలాంటిదేమీ లేదని నాదెండ్ల మనోహర్ బదులిచ్చారు. "దొరబాబు గారు ఎన్నికల ముందే పార్టీలోకి వద్దామని అనుకున్నారు. కానీ కొన్ని కారణాల వల్ల రాలేకపోయారు. ఆయన మా కుటుంబంలో ఒకరిగా ఉండే వ్యక్తి... ఎంతో సౌమ్యుడు.... అటువంటి ఆలోచనలేవీ లేవు... చెక్ పెట్టాల్సినంత అవసరం ఏముంది? ఇది పవన్ కల్యాణ్ గారి నియోజకవర్గం... ఇక్కడ ఎవరికి చెక్ పెడతామండీ? కంప్లీట్ గా పిఠాపురం అనేది పవన్ కల్యాణ్ అడ్డా... ఇక దాని గురించి ఆలోచించాల్సిన అవసరంలేదు" అని నాదెండ్ల వివరించారు.

## భక్తుల సౌకర్యాలలో...

నాయకులు, దేవస్థానం అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, అంతరాలయంలో మంత్రి అనిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రికి ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థ, ప్రసాదాలను వేద పండితులు అందజేశారు. భరతనాట్య కళాకారులను సత్కరించారు. హెూం మంత్రి ఆర్థిక సహాయంతో ఉపమాక ఆలయం వద్ద మజ్జిగ, క్యాలెండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. ఉపమాక వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని తెలిపారు. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుంటున్నారని అన్నారు. ఇప్పుడు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశామని అన్నారు. వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ప్రార్థించానని అన్నారు. తిరుమల తిరుపతి స్వామి వారి ప్రసాదం కూడా ఉపమాకలో అందుబాటులో ఉందని తెలిపారు. భక్తులకు మజ్జిగ, భోజనం సౌకర్యం ఏర్పాటు చేశామని హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు.

## రాయలసీమ అభివృద్ధిపై...

మంత్రి నిమ్మల రామానాయుడు గుర్తుచేశారు. పాలకొల్లు నియోజకవర్గ పరిధిలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో 99 పనుల కోసం రూ. 37.63 కోట్లు కేటాయించినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. పాలకొల్లు పట్టణంలో పది వార్డుల ఏరియాను ముంచెత్తుతున్న దమయ్యపర్తి కోడు ప్రక్షాళనకు రూ. 14 కోట్లు మంజూరు చేశామన్నారు. రూ. 8 కోట్ల వ్యయంతో యలమంచిలి మండలంలో గోదావరి ఏటిగట్టు పటిష్టతకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వివిధ మురుగు కాలువల ప్రక్షాళనకు రూ. 16 కోట్లతో నియోజకవర్గ వ్యాప్తంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. కాజ, మాదవయ్యపాలెం స్లూయిస్ మరమ్మతులకు రూ. 9 కోట్లు అంచనాలతో ప్రతిపాదనలు చేశామని అన్నారు. చింతలపూడి ప్రాజెక్టు పనులు కూడా త్వరలో ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

## ఏపీ కూటమి పాలనపై...



ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. మొత్తం రూ. 3,990 కోట్ల మేరకు ఫీజు రీయిబర్స్‌మెంట్ బకాయిలు ఉంటే ఈ బడ్జెట్‌లో కేవలం రూ. 2,600 కోట్లు మాత్రమే కేటాయించడం దుర్మార్గమని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్యను కుదించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ఈనెల 12న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, వైసీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని వాడవాడలా పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పార్టీ ప్రతినిధులకు సూచించారు.

### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పోటుగారి....

## భాస్కర్ తండ్రి శంకరయ్య మృతి

### నివాళులర్పించిన టిడిపి నాయకులు



వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 10: వెదురుకుప్పం మండలం మొండి వెంగనపల్లి సర్పంచి లలిత మామ,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటుగారి. భాస్కర్ తండ్రి శంకరయ్య మృతి చెందారు శంకరయ్య మృతి దేహానికి నివాళులర్పిం చిన టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి వెదురు కుప్పం క్లస్టర్ ఇంచార్జి మోహన్ మురళి, మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు లక్ష్మీరెడ్డి,మొండివెంగనపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, జనసేన మండల యువజన అధ్యక్షులు కావలి సతీష్, పంచాయతీ నాయకులు తిరుమలయ్య, హరినాథ్ తదితరులు నివాళులు అర్పించారు.

### శ్రీకోదండ రామస్వామి ఆలయంలో.....

## ప్రత్యేక పూజా కార్యక్రమం



వెదురు కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 10: చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలం పెరుమాళ్ళపల్లి గ్రామం శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ఈరోజు జరిగిన బాలలయం పూజా కార్యక్రమం లో ఆలయ ధర్మకర్త ఆలయ కార్య నిర్వహణ కమిటీ సభ్యులు స్థానిక సర్పంచ్ ఉప సర్పంచ్ గ్రామ పెద్దలు యువకులు భారీ ఎత్తున మహిళలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు అందరికీ వేద పండితులు ఆశీర్వదించడం జరిగినది ఆలయ కమిటీ తరఫున తీర్థప్రసాదాలు కూడా ఏర్పాటు చేయడం జరిగింది అని తెలియజేశారు.

## పీలేరులో సావిత్రిబాయి పూలేకు నివాళి



పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 10: అన్నమయ్య జిల్లా పీలేరు సావిత్రి బాయి 27 వర్ధంతిని బాస్ జిల్లా కార్యవర్గ సభ్యు డు ముల్లంగి కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అన్నమయ్య జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు పాల్గొని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు దేశ చరిత్రలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు కావడం గర్వకారణమన్నారు బాల్య వివాహాలు సతీసహ గమనం అంటరానితనంపై పోరాటం చేశారన్నారు ఈ కార్యక్రమంలో ముల్లంగి కృష్ణయ్య హరినాథ గురవయ్య హరీష్ కిషోర్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

### శాంతిపురం నారిశక్తి పర్యావరణ ....

## హిత సైకిల్ పంపిణీ కార్యక్రమం



శాంతిపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 10: శాంతిపురం మండలం శాంతిపురం వెలుగు కార్యాలయం ముందు నిర్వహించిన సైకిల్ పంపిణీ కార్యక్రమం ప్రభుత్వ విప్ డాక్టర్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు, మన రాష్ట్ర ముఖ్యమంత్రి కుప్పం ముద్దుబిడ్డ నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం చిరు వ్యాపారస్తులకు పూల వ్యాపారి,పాల వ్యాపారి, కూరగాయల వ్యాపారి,ఇలాంటి వ్యాపారస్తులకు చేయూతగా సైకిల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు విశ్వనాథ నాయుడు,వైస్ ఎంపీపీ ఉదయ్ కుమార్,జనార్దన్ రెడ్డి, ఎ ఎం సి యు మార్కెట్ వైస్ ఆర్ఎస్ నాగరాజు, కుప్పం నియోజకవర్గం బీసీ సెల్ ఉపాధ్యక్షులు ఈడుగా రమేష్ ,ఆర్ఎస్ మనీ,పుష్ప నారాయణస్వామి,సరిత, శ్యామలమ్మ ,అనసూయమ్మ ,రూప, సుగుణమ్మ,కళావతి,ఏపీఎం శ్రీనివాస్ సీసీలు గోపీనాథ్,భాగ్యలక్ష్మి,రాజేశ్వరి, జ్యోతిలక్ష్మి,సంఘమిత్రలు సైకిల్ బెనిఫిసిలు పాల్గొన్నారు.

## మొదలియార్లను బీసీలుగా గుర్తించాలి

### సాధికార సమితి అధ్యక్షులు మునిరత్నం,

### సూర్య ప్రకాష్,చెక్కునత్తం మణి,



కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 10: కుప్పం నియోజకవర్గ సాధికార సమితి కమిటీ సభ్యులు సోమవారం రోజు శాసన మండలి సభ్యులు డాక్టర్ కంచెర్ల శ్రీకాంత్ గారిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన బీసీ -డి లోని మొదలియార్ కామ్యూనిటి ని కేంద్రం ప్రభుత్వం దృష్టి కి తీసుకుని పోయి కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ జాబితాలో కూడా ఓబీసీ గా గుర్తించి మా కామ్యూనిటి కి న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరిన సాధికార సమితి అధ్యక్షులు మునిరత్నం, ఉపాధ్యక్షులు సూర్య ప్రకాష్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చెక్కునత్తం మణి, నియోజకవర్గ యువత అధ్యక్షులు బాలాజీ, ప్రభు, మంజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

### అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా...

# విద్యాసేవ రత్న జాతీయ పురస్కారం 2025.



వీ.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 10: వీకోట పట్టణంలోని,బాలికల ఉన్నత పాఠశాలలో పి. జి. టీ. గా విధులు నిర్వహిస్తున్న శ్రీమతి డాక్టర్ గడ్డం శాంత కుమారికి" విద్యా సేవా రత్న జాతీయ పురస్కారం"-2025అందుకున్నారు. 34సంవత్సరాలనుండి విద్యా రంగంలోలో ఎంతో మందిని ఉత్తమ పౌరులు గా తీర్చి దిద్దారు. అటు సాహితీ రంగం లోను తన ముద్ర వేశారు. పలుమార్లు ప్రముఖులనుండి జిల్లాస్థాయి లో ఉగాదిపురస్కారు పొందారు.జాతీయ.. అంతర్జాతీయ కవి సమ్మేళనాలలో పాల్గొ న్నారు.వీరి సేవలను గుర్తించి ప్రముఖ సంస్థ మనం ఫౌండేషన్ హైదరాబాద్ మరియు శ్రీదేవి కళా వేదిక ఐరాల సంయుక్త ఆధ్వర్యం లో కాణిపాకం లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాలలో సేవలు అందించిన ప్రముఖులైన మహిళా మూర్తులను గుర్తించి వారిని తగు రీతినగౌరవించారు.ఈ కార్యక్రమం లో డాక్టర్ కె.చక్రవర్తి, డాక్టర్ జీను రాజశేఖర్, అరుణ కుమారి ,జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు.సహా దేవనాయుడు, డాక్టర్ కవికోకిల కొఠారి వెంకటరత్నం,కొఠారి నిర్మల, రెడ్డిప్ప మరియు ఉమ్మడి చిత్తూరు జిల్లా నలుమూలల నుండి వివిధ రంగాలలో ప్రముఖులైన మహిళలు, గాయనీ గాయకులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

## సిఎంను ప్రత్యేకంగా కలసి విన్నవించిన ఎమ్మెల్యే అమర్



పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి10: పలమనేరు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని స్థానిక శాసన సభ్యులు అమరనాథ రెడ్డి సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలసి విన్నవించారు. శాసనసభ సమా వేశాలకు హాజరైన ఆయన సమావేశానంతరం నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోరుతూ సీఎంను తన కార్యాలయంలో ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా నియోజకవర్గంలో సాగు మరియు తాగునీటి శాశ్వత పరిష్కారానికై గంగన్న శిరస్సు, కైగల్ ప్రాజెక్టుల ఏర్పాటు, రైతుల సౌకర్యార్థం మోడల్ మార్కెట్ యార్డ్ ఏర్పాటు, విద్యార్థుల కొరకు సంక్షేమ హాస్టళ్ళు, స్కూల్ భవనలు, బైరెడ్డిపల్లి నందు జామియా మసీద్, షాదీ మహాల్స్, వి.కోటలో కోల్డ్ స్టోరేజ్ లతో పాటు కళాశా లల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. అదేవిధంగా ఎన్నికలకు ముందు ఇంటిం టికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన గ్రామాలలోని స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు నిధులను కేటాయించి ఆదుకోవాలని కోరారు. ప్రతి అంశంపై సిఎంకు క్షుణ్ణంగా ఆయన వివరించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నియో జకవర్గ అభివృద్ధి పూర్తిస్థాయిలో కుంటు పడిందని వివరించారు.గత టీడీపీప్రభుత్వ హయాంలో మంజూరైన పనులన్నింటినీ వైకాపా నేతలు అభివృద్ధి చేయకపోవడం తో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని తెలియజేశారు. కాబట్టి నియోజకవర్గ అభి వృద్ధికి అన్ని విధాల నిధులను అందించి ఆదుకోవాలని ఆయన కోరారు. దీనిపై స్థానికులంగా స్పందించిన సీఎం పలమనేర్ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దూళిపాల నరేంద్ర తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఏక్తా యాంటీ కరప్షన్ రాష్ట్ర అధ్యక్షులకు స్వాగతం



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 10: శ్రీకాళహస్తి ఏక్తా యాంటీ కరప్షన్ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా మీర్ బర్కత్ ఆలీ హష్మీ జరిగింది ఆయన ఆది వారం శ్రీకాళహస్తికి విచ్చేశారు. ఆయనకు చిత్తూరు జిల్లా అధ్యక్షులు లాల్ బాషా, చిత్తూరు జిల్లా ఏక్తా యాంటీ కరప్షన్ మీడియా జిల్లా ప్రెసిడెంట్ పి.యాసిన్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఏక్తా యాంటీ కరప్షన్ అధ్యక్షులు మీర్ బర్కత్ ఆలీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్నందున అధ్యక్షులు గా ఎన్నుకోవడం చాలా హర్షనీయమ న్నారు. ఏక్తా యాంటీ కరప్షన్ సంస్థ తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నుకు న్నందుకు సంస్థ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. సమస్త అభివృద్ధి కొరకు పేద మధ్యతరగతి సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మౌలానా సాహెబ్, మీర్జాన్ సాహెబ్,అన్వర్,సిపిఎం పార్టీ రషీద్,ఎస్ ఆర్ రఫీ,రిజ్వాన్ రఫీ,సర్దార్ మహమ్మద్,చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యే చే.....

## ఫీజు పోరు పోస్టర్ ఆవిష్కరణ



పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 10:అన్నమయ్య జిల్లా పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి చే ఫీజుపోరు పోస్టర్ ఆవిష్కరణ ఈనెల 12న జిల్లా కలెక్టరేట్ వద్ద జరుగు. ఫీజు పోరు కార్యక్రమం విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ పేదరికం అనేది ఉన్నత చదువులకు అడ్డంకి కాకూ డదు ఆలోచనతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఈ పథకం వల్ల ఎంతో మంది పేదలు ఇంజనీరింగ్, మెడిసిన్ అభ్యసించి జీవితంలో స్థిరపడ్డారని తెలిపారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎం అయ్యాక 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు అమ్మ ఒడి పథకం అమలు చేశారన్నారు. ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారి కోసం విద్యా దీవెన, వసతిదీవెన పథకాలు తెచ్చారని చెప్పారు. ఐదేళ్ల జగన్ పాలనలో విద్యారంగానికి రూ.73 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతోందని, త్వరలోనే అకడమిక్ ఇయర్ కూడా ముగుస్తుందన్నారు. ఇప్పటికే చాలా చోట్ల ఫీజుల కోసం కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల రూ.700 కోట్లు విడుదల చేస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. దీని వల్ల కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఫీజు చెల్లిస్తేనే పరీక్షలకు కూర్చొబెడతామని అంటున్నారని ఇప్పటికే ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువుల కోవిమర్శించారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ.3900 కోట్లు చెల్లించాలని, ఇదే డిమాండ్తో ఫిబ్రవరి 3వ తేదీన జిల్లా. కేంద్రమైన రాయచోటిలో ఫీజు పోరు చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని, కార్యక్రమం విజయవంతం చేయాలని కోరాడు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్ మోహన్ రెడ్డి, చక్రధర్ పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి భువనేశ్వర్ రెడ్డి ద్వారకావాథ రెడ్డి లోకనాథ్ రెడ్డి విక్టరీ వెంకటరమణారెడ్డి కాలనీ చిన్న రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు పరీక్ష కిట్టు ....

## పంపిణీ చేసిన పిళ్ళారి ఫౌండేషన్

శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 10: శ్రీకాళహస్తి పట్నంలోని వివిధ పాఠశాల నందు రాబోవు పదో తరగతి పరీక్షలకు చదువుతున్న విద్యార్థులకు పిళ్ళారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షా కిట్ ఉచితంగా పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి పట్నంలోని బాబు అగ్రహారం రాజీవ్ నగర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎన్టీఆర్ నగర్ లోని గురుకుల పాఠశాల మరియు వెడాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ఈ కార్యక్రమం జరిగింది. పిళ్ళారి ఫౌండేషన్ అమరావతి మాట్లాడుతూ ఇంతకుముందు చాలా పాఠశాలలో అనేక సహాయ సహకారాలు అందించిన పిళ్ళారి ఫౌండేషన్ మరల రాబోవు పదో తరగతి విద్యార్థులకు పరీక్షా కిట్ల అందించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అలాగే విద్యార్థులకు ఏ అవసరం ఉన్న తప్పక సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిళ్ళారి ఫౌండేషన్ అధినేత అమరావతి , పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే బొజ్జల పై నిందలేస్తే ఊరుకోం

## స్థిరత్వం లేని రాజకీయ నేత ఎస్సీవీ- టిడిపి నేత మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్

శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 10: శ్రీకాళహస్తి స్థిరత్వం లేని రాజకీయాలకు క్యారాఫ్ అడ్రస్ గా ఎన్నికల సమయం నాటికి ఏ పార్టీలో ఉంటాడో తెలియని రాజకీయ నేతగా మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు నిలిచారని టిడిపి నేత మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిపై లేనిపోని నిందలేస్తే సహించేది లేదని ఆదివారం నాడు విడుదల చేసిన ప్రకటనలో హెచ్చరించారు. ఓటేరు భూముల వివాద సమస్య ఎప్పటి నుంచో ఉందని ఇవాళ కొత్తగా వచ్చింది కాదన్నారు. ఉన్నఫలంగా రైతులు గుర్తొచ్చి ఇప్పుడు అండగా ఉన్నాంటూ చెబుతున్న ఎస్సీవీ గత ఐదేళ్లు వైసీపీలో ఉన్నసమయంలో ఎందుకు ఈ అంశం ప్రస్తావించలేదని నిలదీశారు. అదేవిధంగా శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి గడచిన ఐదేళ్ల పాలనలో సాగించిన భూ కబ్జాలు ,అవినీతి, అరాచక, అక్రమాలపై ఏనాడైనా ఎస్ సి వి పాత్రికేయ సమావేశం పెట్టి ఎండగట్టారా అని ప్రశ్నించారు. తన దృష్టికి వచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఓటేరు చెరువును ఆక్రమణల నుంచి సంరక్షించాలని మాట్లాడేసరికి ఆత్మరక్షణలో పడి విచక్షణ కోల్పోయి ఏమి మాట్లాడుతున్నారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఓటేరు భూములపై మాట్లాడే తప్ప ఎక్కడ కూడా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఎస్ సి వి నాయుడు పేరు ప్రస్తావించలేదని అయినప్పటికీ ఆయనను ఆక్రోసం ,ఆందోళన ఎందుకో అర్థం కావడం లేదన్నారు.ఇప్పటికైనా నాటి నుండి నేటి వరకు తెలుగుదేశం పార్టీతో సుదీర్ఘ ప్రయాణం సాగిస్తూ 40 ఏళ్ల రాజకీయ చరిత్ర కలిగిన బొజ్జల ఫ్యామిలీ గురించి మాట్లాడే ముందు తన అవినీతి పుస్తకంలోని పేజీలను చదువుకోవాలని హితవు పలికారు. మాజీ మంత్రి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత కీర్తిశేషులు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ఆశయ సాధనే లక్ష్యంగా తండ్రికి తగ్గ తనయుడుగా ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి నేటి వరకు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని అసెంబ్లీలో నియోజకవర్గంలో గత వైకాపా ఐదేళ్ల పాలనలో నెలకొన్న సంక్షేమ వసతి గృహాల్లోని దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రెండు నెలల వ్యవధిలోనే శ్రీకాళహస్తి పట్టణం, రేణిగుంట పట్టణంలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను మౌలిక వసతులతో పాటు కార్పొరేట్ స్థాయిలో అన్ని హంగులతో తీర్చిదిద్ది ఇటీవలే ప్రారంభించి సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల పాలిట మామయ్యగా నిలిచారని, అదేవిధంగా ఇటీవల ముక్కంటి బ్రహ్మోత్సవాలను నభూతో న భవిష్యత్, కని విని ఎరుగని రీతిలో నిర్వహించి సామాన్య భక్తులకే పెద్ద పీట వేసి నియోజకవర్గ ప్రజల నుండే కాకుండా ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నుండి అభినందనలు అందుకోవడమే కాకుండా వైకాపా నేతల సైతం ప్రశంసించారని గుర్తు చేశారు. అదేవిధంగా ప్రస్తుతం జరుగుతున్న ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో శ్రీకాళహస్తి పట్టణంలోని 20 ఏళ్ల పైగా నివాసముంటున్న కొండమిట్ట, ఎన్టీఆర్ నగర్, దుర్గమ్మ కొండ, ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారికి శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం అందజేయాలని రెవెన్యూ మంత్రి సైతం కోరి పేదల పక్షాన నిలిచారని గుర్తు చేశారు. ఇలా స్వల్ప కాల వ్యవధిలోని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, జవాబుదారితనంతో కూడిన పాలన అందిస్తూ నియోజకవర్గ ప్రజల నుండి ప్రశంసలు అందుకుంటున్న తరుణంలో ఓర్వలేకే మాజీ ఎమ్మెల్యే ఎస్సీ వి లేనిపోని అబాండాలు వేస్తున్నారని రాజకీయాల్లో హుందాతనం ఉండాలని తెలుగుదేశం పార్టీ అంటేనే క్రమశిక్షణకు మారుపేరని క్రమశిక్షణకు, అభివృద్ధికి మారుపేరు బొజ్జల కుటుంబం అని కాబట్టే మాజీ మంత్రి కీర్తిశేషులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డిని ఆరుసార్లు ఎమ్మెల్యేగా ,మూడుసార్లు మంత్రిగా చేసిన ఘనత నియోజకవర్గ ప్రజలదేనని అన్నారు. ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యే తన వ్యాఖ్యలపై పునరాలోచన చేసుకోవాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉందని వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని లేనిపక్షంలో తెలుగుదేశం పార్టీ శ్రేణుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని తెలిపారు.



### మహిళల ఆరోగ్య సంరక్షణ....
## దేశ ప్రగతికి మూలం



కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 10: మహిళల ఆరోగ్య సంరక్షణ దేశ ప్రగతి కి మూలమని కళాశాల చైర్ పర్సన్ శాంతా నాగరాజు అన్నారు. సోమవారం కే డి సి మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో కుప్పం మండలం ఎన్ కొత్త పల్లిలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి నాగరాజ్ మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తూ దేశ ప్రగతిలో భాగస్వాములయ్యారని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ హరిత మండవ మాట్లాడుతూ మహిళలు ఇటీవల ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోగ్య సమస్యలను వివరించారు. రొమ్ము క్యాన్సర్, సర్జికల్ క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ వైద్యుల సూచనలు పాటించి మందులు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ సాగర్ రాజ్ కార్యక్రమానికి తోడ్పాటు అందించిన గ్రామ సర్పంచ్ రాజశేఖర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధారాణి, మహిళా సాధికారిక విభాగం కోఆర్డినేటర్ ఆశ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మన దేశ రాజకీయాలు బాగాలేవు

### మోడీ పేదల ప్రజల గురించి ఆలోచించడం లేదు..
### ట్రంప్ గురించి టైగర్ల గురించి ఆలోచిస్తున్నాడు..
### మాజీ కేంద్రమంత్రి చింతామోహన్



గంగాధర నెల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి10: చిత్తూరు జిల్లా గంగాధర్ నెల్లూరు మండల కేంద్రం వద్ద మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ నిరసన ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ వెంటనే ప్రారంభించాలి అంటూ నినాదాలు చేసిన చింతామోహన్ కేంద్రం పై రాష్ట్రంపై హాట్ కామెంట్ చేసిన మాజీ కేంద్రమంత్రి చింత మోహన్ దేశ రాజకీయాలు బాగా లేవు మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత ఆయన ప్రజల గురించి ఆలోచించడం లేదు మోడీ ఆలోచిస్తున్నది ట్రంప్ గురించి టైగర్ల గురించి ఆలోచిస్తు న్నాడు, దేశంలో పేద రికం గురించి ఆలోచించడం లేదు పెరిగిన టాక్సీ గురించి ఆలోచించడం లేదు ఆయ న ఆలోచిస్తున్నది ఏమిటంటే దినాని కి నాలుగు సార్లు గుడ్డలు మార్చుకోవడం ఆలోచిస్తున్నాడు,దేశ పరిస్థితి అధ్వానంగా ఉన్నది ఉద్యోగుల పరిస్థితి అధ్వానంగా ఉన్నది.రాష్ట్ర పరిస్థితి చంద్రబాబు నాయుడు ఏదో చేస్తాడు అనుకున్నాను కానీ ఒక్క హామీ నెరవేర్చలేదు ఆడవాళ్ళకి ఆర్టీసీ బస్ ప్రయాణం ఫ్రీ అన్నాడు రైతుల కు రైతుబంధువు అన్నాడు ఏదిచేయలేదు. అని కేంద్ర మాజీ మంత్రి చింతామహన్ హాట్ కామెంట్ చేశాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిరంజీవి కాంగ్రెస్ నాయకులు రైతులు మహిళలు పాల్గొన్నారు.

### జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని.....
## విజయవంతం చేద్దాం...
### జనసేన సమన్వయకర్త డాక్టర్ బి.వి నరేష్



కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 10: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుక "ఛలో పిఠాపురం" ఆత్మీయ సమావేశంను విజయవంతం చేయాలని జనసేన కుప్పం నియోజక వర్గ సమన్వయకర్త డాక్టర్ బి.వి నరేష్ పిలుపునిచ్చారు. ఆదివారం నాడు స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్చి 14న పిఠాపురంలో నిర్వహించిన చలో పిఠాపురం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్క జన సైనికులు, వీర మహిళలు ముందుకు రావాలని కోరారు. మండల అధ్యక్షులతో సమావేశం నిర్వహించామని నియోజకవర్గంలోని నాలుగు మండలాల జనసైనికులు, వీర మహిళలు పిఠాపురంలో నిర్వహించే ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు కుప్పం నుంచి భారీగా తరలి వెళ్ళనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం చలో పిఠాపురం గోడపత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో రామమూర్తి వేణు మునెప్ప వామన మూర్తి పవన్ మహేష్, అమీర్, హరీష్, కిషోర్, నవనీత, సురేష్, గణేష్, హంసాగిరి, బాలు, పవన్, భాస్కర్, పాండు, చంద్రశేఖర్, రాహుల్ తదితరులు ఉన్నారు.




# మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక చర్యలు



వరదయ్యపాలెం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 10: వరదయ్యపాలెం మండలం లోని బత్తల వల్లం పంచాయతీ పరిధిలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికారుల దృష్టి పెట్టారు ఇక్కడ గత కొద్ది రోజులుగా తీవ్రమైన అనారోగ్య సమస్యలు, జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయంపై సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో కథనాలు రావడం జరిగింది దాంతో స్పందించిన అధికారులు మెరుగైన వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు సూళ్లూరుపేట డివిజనల్ పంచాయతీ అధికారి, జిల్లా మెడికల్ ఆఫీసర్, ఇతర క్షేత్రస్థాయి అధికారులు పంచాయతీలో సందర్శనలు చేపట్టారు ఎక్కడ గాని డెంగ్యూ కేసులు నమోదు కాలేదని తేల్చి చెప్పారు అక్కడికక్కడే ప్రజలకు వైద్య పరీక్షలు, మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేసి ప్రజలకు మంచి అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఎండలు విపరీతంగా ఉండటం, అక్కడక్కడ కొన్నిచోట్ల కలుషిత నీటిని సేవించడం, ఇతర కారణాలతో ఆరోగ్య సమస్యలు కొందరికి వచ్చిందని గుర్తించారు చిన్న పాండూరు వైద్య అధికారులు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్ కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్, చిన్నపాండూరు వైద్య అధికారి డాక్టర్ లావణ్య, ఎం పి హెచ్ ఈ ఓ రవీంద్ర, పీహెచ్ఎన్ రాణి, సి హెచ్ ఈ ఓ నిఖిల, ఏఎన్ఎం కవిత, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

### డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో......
## ఘనంగా మహిళా దినోత్సవం కార్యక్రమం




వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 10: వెదురుకుప్పంలోని డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద గారి ఆధ్వర్యంలో,మహిళా సాధికారత విభాగం డాక్టర్ ఎస్.రుష్మ, ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సి.మంగళ గౌరీ,ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకటేష్ సంయుక్తంగా నిర్వహిం చిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళా సాధికారత,హక్కులు, విద్య,ఆరోగ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగా లతో మహిళా ప్రాముఖ్యతను చాటి చెప్పారు. ఈ కార్యక్రమం మహిళా సాధికారతను ప్రోత్సహించడంలో విజయవంతమైంది. ఈ కార్యక్రమం లో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.లక్ష్మీ ప్రసన్న లత, డాక్టర్ ఏ.సి. భరణినాద్ రెడ్డి, డాక్టర్ వి. ప్రభాకర్ రావు,డాక్టర్ కె.శంకర్ రెడ్డి మరియు అధ్యాపక అధ్యాపకేత్ర బృందం మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ఘనంగా మహిళా దినోత్సవం వేడుకలు...



గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 10: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం నాడు గుడిపల్లిలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుప్పం రోసా మిస్టికా స్కూల్ వ్యవస్థాపకురాలు రూబీ మరియు కుప్పిగానిపల్లి పంచాయితీ మహిళా సంఘాల మహిళలు వారి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుడిపల్లి మండల మాజీ ఎంపీపీ మునిరాజు, లయన్స్ క్లబ్ అడ్వైజర్ డా. ఎ. మహేష్, ప్రొఫెసర్ డా. యశోద, మహిళా అధ్యక్షురాలు పద్మ, అడ్వకేట్ కె.వి ప్రసాద్, కానిస్టేబుల్ కవిత, వాసు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మునిరాజు మాట్లాడుతూ మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారని మహిళలు కేవలం వంటింటికే పరిమితం కాకుండా పలు రంగాల్లో రాణిస్తూ వారు కూడా పురుషులకు సమానంగా వారి జీవన శైలిని కొనసాగిస్తున్నారు అని, మన గ్రామాల్లో ఉన్న మహిళలకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా తాము ఇప్పుడు ముందుంటామని తెలుపుతూ స్వయం ఉపాధికి ప్రోత్సహిస్తామని తెలిపారు. అదేవిధంగా డా. ఎ . మహేష్ మాట్లాడుతూ ప్రతి మహిళ కూడా ఒక శక్తిగా ఎదగాలని ప్రతి ఒక్కరు కూడా ప్రస్తుతం మన దేశ ఆర్థిక వ్యవస్థ శాసించే స్థాయిలో ఉన్నారని దీనిని ప్రతి ఒక్కరు గ్రహించి ఎవరు కూడా తక్కువ కాదని మన గ్రామ స్థాయిలోని మహిళలు కూడా నిరూపించాలని అందుకు ఎటువంటి సహాయం కావాలన్నా తమ నుండి అందిస్తామన్నారు. అదేవిధంగా రోసా మిస్టికా వ్యవస్థాపకురాలు రూబీ ఆగ్నెస్ మాట్లాడుతూ మహిళలు మూఢనమ్మకాలని వదిలి ప్రస్తుత ఆధునిక కాలంలోకి రావాలని కొన్ని మారుమూల గ్రామాల్లో వితంతు మహిళలు, ఒంటరి మహిళలను చిన్నచూపు చూస్తున్నారని వాటన్నిటిని కూడా ఎదిరించి ప్రస్తుత సమాజంలో గెలవాలని అందుకోసమే తనవంతుగా ఒంటరి మహిళలకు అండగా ఉండాలని ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల ద్వారా వారికి సంఘాలు ఏర్పాటు చేసి వారికి జీవన ఉపాధి కల్పించాలని సంకల్పంతో ఒంటరి మహిళలకు సంఘాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దానిద్వారా వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్నటువంటి ఒంటరి మహిళలకు ఆమె చీరలు పంచిపెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాడేపల్లి గ్రామానికి చెందిన రత్నశీల మరియు వారి బృందం కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది అనంతరం వారికి బహుమతులు ప్రధానం చేసారు. ప్రస్తుతం ప్రతి ఇంటిలోనూ ఎక్కువ బాధ్యతలు తీసుకుంటున్న ప్రతి తల్లి కూడా సమాజానికి బాధ్యతాయుతమైన బిడ్డలను అందించాలని ప్రొఫెసర్ యశోద తెలిపారు. వెలుగు సంఘాల సిసి వెంకటస్వామి ఆయన పాటలతో స్త్రీ యొక్క గొప్పతనాన్ని కార్యక్రమంలో వినిపించారు. ఈ కార్యక్రమంలో రోసా మిస్టికా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.

### తిరుపతిలో ఘనంగా ముగిసిన .....
## ఎన్ హెచ్ ఆర్ సి వార్షికోత్సవ వేడుకలు
### కుప్పం ఎన్ హెచ్ ఆర్ సి వైస్ చైర్మన్ దేవ రాజ్..



తిరుపతి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 10: తిరుపతి ఎస్ వి ఆడిటోరియం నందు ఎన్ హెచ్ ఆర్ సి మూడవ జాతీయ సమా వేశం, వార్షికోత్సవ వేడుకలు ఎన్ హెచ్ ఆర్ సి జాతీయ చైర్మన్ సంపత్ కుమార్ ఆదే శాలతో,ఎన్ హెచ్ ఆర్ సి నేషనల్ చీఫ్ సెక్రటరీ బుల్లెట్ రవి ఆధ్వర్యంలో,ఎన్ హెచ్ ఆర్ సి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి రాజా, ఎన్ హెచ్ ఆర్ సి దక్షిణ భారత చైర్మన్ భాస్కర్, ఎన్ హెచ్ ఆర్ సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దేశం నలుమూలల దాదాపు 500 మందికి పైగా ఎన్ హెచ్ ఆర్ సి సభ్యులు పాల్గొన్నారనీ కుప్పం నియోజకవర్గ ఎన్ హెచ్ ఆర్ సి వైస్ చైర్మన్ దేవరాజ్, స్పష్టం చేశారు. కార్య క్రమంలో కుప్పం నియోజకవర్గ ఎన్ హెచ్ ఆర్ సి చైర్మన్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఇంట గెలవని... జగన్..
## రచ్చ గెలుస్తాడా..?

విజయవాడ : ఇంట గెలచి రచ్చ గెలవమన్నారు పెద్దలు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మాత్రం ఇంట గెలవలేకపోతున్నారు. ఆయన కుటుంబసభ్యులే దూరమయ్యారు. రాజకీయాల్లో జగన్ కు ఇది చాలా ఇబ్బంది కరమైన పరిణామం. ఎందుకంటే .. కుటుంబ సభ్యుల మద్దతు లేని జగన్ ఇక జనం సపోర్టు ఎలా పొందుతారన్న ప్రశ్నకు వారి వద్ద నుంచి సమాధానం బహుశా రాకపోవచ్చు. 2019 ఎన్నికలకు ముందు వరకూ ఒక్కటిగా ఉండే వైఎస్ కుటుంబం వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విడిపోయారు. కారణాలు బయటకు ఏవైనా చెప్పొచ్చు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవచ్చు. కానీ సామాన్య ప్రజలకు మాత్రం వైఎస్ కుటుంబంలోని విభేదాలే బయటకు కనిపిస్తాయి. గత ఎన్నికలలో వైసీపీ ఘోర ఓటమికి ఇది కూడా కారణమని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. వైఎస్ జగన్ సొంత పార్టీ పెట్టుకుని తాను రాజకీయంగా ఎదిగి ఉండవచ్చు. కానీ 2014కు ముందు నుంచే జగన్ కు తల్లి విజయమ్మ, సోదరి వైఎస్ షర్మిల మద్దతు రాజకీయంగా పుష్కలంగా లభించేది. ఇద్దరూ అలుపెరగకుండా జగన్ విజయం కోసం పనిచేశారు.షర్మిల అయితే జగన్ జైలులో ఉన్న సమయంలో సుదీర్ఘ పాదయాత్ర చేసి సోదరుడికి అండగా నిలిచారు. విజయమ్మ కూడా రేయింబవళ్లూ జగన్ ను గెలిపించాలంటూ ఊరూ వాడ తిరిగి ప్రచారాన్ని నిర్వహించారు. ఫలితంగా 2019 ఎన్నికల్లో జగన్ అధికారంలోకి రాగలిగారు. వంద శాతం వీరి వల్లనే కాకపోయినా ముప్ఫయి శాతం మాత్రం వైసీపీ విజయంలో వీరిద్దరి పాత్ర ఉందన్నది ఎవరూ కాదనలేరు అదే 2024 ఎన్నికలకు వచ్చేసరికి జగన్ కు అంతా దూరమయ్యారు. తల్లి విజయమ్మ కూడా కుమారుడికి మద్దతుగా నిలవడం లేదు. అప్పుడప్పుడూ ఇడుపులపాయకు వచ్చినప్పుడు మినహా జగన్ ను ఆమె కలవడం లేదు. జగన్ వెళ్లి ఆమెను కలసి మాట్లాడింది. దీంతో పాటు ఆస్తుల తగాదాలు ఇప్పుడు మరింత దూరాన్నిపెంచాయి. న్యాయస్థానాలను ఆశ్రయిస్తుండంతో కుటుంబ సభ్యుల రచ్చ రాజకీయంగా జగన్ కే ఎక్కువ నష్టం చేకూరుస్తుందన్నది విశ్లేషకుల అభిప్రాయం. వైఎస్ షర్మిలకు పోయేదేమీ లేదు. ఆమె అధికారంలోకి వస్తానని ఊహించుకోవడం లేదు. అలాగే కాంగ్రెస్ పార్టీ పవర్ లోకి వచ్చే అవకాశం లేదు. దీంతో ఏదైనా నష్టం జరిగితే అది జగన్ కే జరుగుతుంది. ప్రతి కుటుంబంలో రక్త సంబంధీకుల మధ్య వైరుధ్యాలు,ఆస్తి తగాదాలున్నప్పటికీ రాజకీయాల్లో మాత్రం వాటికి దూరంగా ఉండాలి. ప్రజాజీవితంలో ఉన్నప్పుడు జనం వాటిని గమనిస్తారు. సొంత తల్లిని, చెల్లిని జగన్ మోసం చేస్తే ఇక జనాన్ని ఎందుకు మోసం చేయరంటూ గత ఎన్నికల నుంచి టీడీపీ, జనసేన నేతలు పెద్దయెత్తు చేసిన విమర్శలు జనంలోకి బాగా చొచ్చుకు వెళ్లాయి. కానీ జగన్ మాత్రం పట్టించుకోలేదు. దీనికితోడు వైఎస్ వివేకాహత్య కూడా జగన్ గెలుపుకు ఆటంకంగా మారింది. ఇటు కుటుంబంలో ఎవరి మద్దతు లేకపోవడంతో పాటు పైగా విమర్శలు కూడా వారి నుంచి జోరుగా వస్తుండటం జగన్ కు రాజకీయంగా ఇబ్బందులే తప్ప భవిష్యత్ లోనూ ఇవి ఏమాత్రం సరికాదన్న కామెంట్స్ వైసీపీ నేతలే అంటుండటం విశేషం.

### కుప్పం మున్సిపాలిటీ కొత్తపేటలో ఎన్టీఆర్ సుజాల సురక్షిత తాగునీటి పథకం.....
## ఘనంగా ప్రారంభించిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్







కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 10: కుప్పం కొత్తపేటలో 13 14 15 వార్డులకు సంబంధించిన ఎన్టీఆర్ సుజాల తాగునీటి ట్యాంకు పాడు కావడంతో గత ఏడాది నుంచి త్రాగడానికి నీరు లేకుండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగింది. ఈ విషయాన్ని గమనించిన కొత్తపేట ఇంచార్జ్ ముఖేష్ మరియు కొత్తపేటకు సంబంధించిన తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాజీ జెడ్పిటిసి రాజకుమార్ క్లస్టర్ ఇంచార్జ్ స్వతంత్ర శేఖర్ సహకారంతో ఎన్టీఆర్ సుజాల స్రవంతి త్రాగునీటి ట్యాంకు మరవతు చేయించి వినియోగంలోకి తీసుకు రావడం జరిగింది. ఆదివారం నాడు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ చేతులమీదుగా ఎన్టీఆర్ సుజల స్రవంతి త్రాగునీటి ట్యాంకును కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి కొళాయి ద్వారా త్రాగునీలు ప్రజలకు అందించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల మాట్లాడుతూ.. కుప్పం పట్టణంతో పాటు నియోజకవర్గంలో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదేవిధంగా ఎన్టీఆర్ సుజల సురక్షిత మంచినీటి సరఫరాను పునరుద్ధరించి, మిషనరీలను ఆధునీకరణ చేసి ప్రజలకు సుద్ధ జలం అందజేస్తామని పేర్కొన్నారు... ఈ కార్యక్రమంలో బూతు ఇన్చార్జిలు, వార్డు ఇన్ చార్జీలు, తెలుగుదేశం పార్టీ నాయకులు గోపీనాథం, జయమ్మ ,మనం, సుకుమారి, మహేంద్ర వాసు ,మురళీ, లోకేష్ తదితరులు పాల్గొన్నాడు.

OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036